క్లుప్తంగా

నేటినుంచి కార్తీకమాసం ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: శివ కేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 2వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు పట్టణంలోని శ్రీఉమాచంద్రమౌళీశ్వరాలయం, శ్రీపార్వతి రామలింగేశ్వరాలయం, శ్రీభక్తమార్కండేయ శివాలయంలో, వేంకటేశ్వరబజార్‌లోని స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నెలరోజుల పాటు కార్తీక మాస పూజలు జరుగనున్నాయి. కార్తీక మాసంలో శివుడికి భక్తులు వివిధ రకాల అభిషేకాలు చేయిస్తే పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహం తప్పక లభిస్తుందని అర్చకులు తెలిపారు.

తడిసిన మక్కలు



బయ్యారం: మండలంలోని నామాలపాడు, గంధంపల్లి–కొత్తపేట, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో పలు చోట్ల ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిసిపోయాయి.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

కురవి: ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వీరభద్రస్వామి జూనియర్ కాలేజీ ఆవరణలో నూతన ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా మంచి ప్రభుత్వాన్ని, నేతను ఎన్నుకునే అవకాశం లభిస్తుందన్నారు. . కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.వెంకన్న, సీసీ కృష్ణయ్య, బీఎల్ఓ అరుణ, అధ్యాపకులు కిషన్, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మరిపెడ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ వీరారం గ్రామ అధ్యక్షుడు బానోతు హరిసింగ్ అన్నారు. మరిపెడ మండలం వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్‌నాయక్‌తండా రోడ్డు గత నెలలో కురిసిన వర్షాలకు ధ్వంసం కాగా, రోడ్డు మరమ్మతు పనులు శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర నవీన్, జెట్టి రాములు, ఏర్పుల లింగయ్య, సోమేశ్వర్‌రావు, బొల్లం కొమరయ్య, డీఎస్ రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: కొలిపాక



నెహ్రూసెంటర్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొలిపాక వెంకటస్వామి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఓటు నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల, అధ్యాపకుల ఆశీర్వాదంతో సీపీఎస్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే పాత పెన్షన్ తోపాటు, అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉగ్గంపల్లిలో క్షుద్రపూజల కలకలం

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో ఓ ఇంట్లో క్షుద్రపూజల కలకలం రేపింది. గ్రామానికి చెందిన ముత్యం రంజిత్ దీపావళి పండుగకి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు రంజిత్ ఇంటి ముందు పసుపు, కుంకుమలతో నక్షత్ర ఆకారం బొమ్మ గీసి నిమ్మకాయలు, కొబ్బరికాయలతో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. శుక్రవారం తెల్లవారు జామున గమనించిన ఇంటి కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు భయాందోళన చెందారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థికసాయం



తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమడూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ధీకొండ మల్లమ్మ అనే నిరుపేద కుటుంబానికి గ్రామ సహాయ నిధి వాట్సప్ గ్రూప్ ద్వారా సేకరించిన రూ.76వేల నగదును గ్రామ పెద్దలు, యువత శుక్రవారం అందించారు.

వైభవంగా దీపావళి వేడుకలు

శ్రీకృష్ణభగవానుడు లోకకల్యాణార్థం నరకాసురుడిని సంహరించి భక్తులకు అందించిన దీపావళి పండుగను గురు, శుక్ర వారాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దీపం పూజలు, శ్రీ మాహాలక్ష్మీదేవి అమ్మవారి పూజలు, కేదారేశ్వర వ్రతాలు, నోములను వైభవంగా ఆచరించారు. సిరులను కురిపించే శ్రీలక్ష్మీదేవి అమ్మవారు భక్తుల అందరి ఇళ్లలో సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలుగజేయాలని ఆకాంక్షిస్తూ అమ్మవారి సన్నిధిలో పసుపు కుంకుమలు చల్లి, నూతన కరెన్సీనోట్లు, పలు రకాల పిండివంటలు, మిఠాయిలను నైవేద్యంగా సమర్పించి దీపాలతో పూజలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మహబూబాబాద్ రూరల్: దీపావళి సంబురాల్లో మార్వాడి కుటుంబ సభ్యులు



దోర్నకల్: లక్ష్మీపూజలో పాల్గొన్న మార్వాడీ మహిళలు



నర్సింహులపేట: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



బయ్యారం: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మరిపెడలో: టపాసులు కాలుస్తున్న కుటుంబ సభ్యులు



గార్లలో..

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కార్యక్రమం మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల, గడ్డిగూడెం, గడ్డిగూడెం తండా, సంద్రాల్లగూడెం, సికింద్రాబాద్ తండా గ్రామాల్లో శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ రమేష్ రెడ్డి ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు.

దంతాలపల్లి: ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటా సర్వేలో భాగంగా మండలంలోని బొడ్లాడ, నిదానపురం గ్రామాలలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి, వీరన్న, ఎంపీడీఓ వివేక్‌రామ్ పరిశీలించారు. సర్వే నిర్వహించే సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.



దంతాలపల్లి: సర్వే పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

పేదల అభివృద్ధికి ఇందిరాగాంధీ కృషి



గూడూరు: ఇందిరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మహబూబాబాద్ రూరల్: ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా గురువారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఆమె చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ పేద ప్రజల అభివృద్ధికి ఎంత గానో కృషి చేశారని ఆమె చేసిన సేవలను కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

తొర్రూరు: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చెకుముకి టాలెంట్ టెస్టు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈనెల 7న మండల స్థాయిలో, 21న జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్టు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, జేవీవీ ప్రతినిధులు యాకయ్య, ప్రభాకర్, కుమార్, వెంకన్న, ముత్తిలింగం, రమేశ్ పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను కొనసాగించాలి

కేసముద్రం: ఆదర్శ రైతు వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి కొనసాగించాలని ఆదర్శ రైతు కమిటీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తండా వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆదర్శరైతులను నియమించారని, అదే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలన్నారు. అనంతరం మాజీ ఆదర్శ రైతుల ఉమ్మడి కేసముద్రం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉమ్మగాని ప్రభాకర్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా బండి వీరభద్రయ్య, కోశాధికారి వాంకుడోతు సర్వన్, ఉపాధ్యక్షుడు రూప్‌సింగ్, సహాయ కార్యదర్శి యాకయ్య, సలహాదారులు గంజి రాజేందర్‌రెడ్డి, భాగ్యమ్మ, సాయిలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

నిర్లక్ష్యంతో ఇబ్బందులు

దోర్నకల్: మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో మున్సిపాలిటీ పరిధి ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సమస్యను కలెక్టర్‌తోపాటు భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి భగీరథ నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశాడు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ పోరాటాలు

నెహ్రూసెంటర్: కార్మిక లోకానికి అండగా 105ఏళ్లుగా పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులకు అండగా ఏఐటీయూసీ ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి ముందే ఏఐటీయూసీ ఏర్పడి గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేసి కార్మిక హక్కులను, చట్టాలను సాధించిన ఘనత సంఘానికి ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు రేషపల్లి నవీన్, మంద శంకర్, రాము, సోమయ్య, రవి, రజిని, జ్యోతి, ఆదాం, సురేష్, శ్రీను, పాల్, జానీ, పెరుగు కుమార్, ప్రవీన్, ఉపేంద్ర పాల్గొన్నారు.

బెనిఫిట్స్ అందక కార్మికుల ఇబ్బందులు

కార్మికశాఖలో జరుగుతున్న జాప్యం, నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, కార్మికులకు అందాల్సి న బెనిఫిట్స్ రావడంలో జాప్యం జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్ అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి, కార్మిక వ్యతిరేక విధానాలతో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో మంద శంకర్, జానీ, శ్రీను, యాకయ్య, పాల్, రమేష్, శ్రావణ్, వెంకన్న, రమణ, మధు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అమరుల ఆశయసాధనకు ఉద్యమిద్దాం



నెహ్రూసెంటర్: అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీరంగదాసు, మాదవన్న స్మారక స్థూపాల వద్ద శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి హెచ్.లింగన్న, గుజ్జు దేవేందర్, బట్టు చైతన్య, సామ పాపయ్య, బోనగిరి మధు, పర్వత కోటేష్ పాల్గొన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఉన్న స్మారక స్థూపాల వద్ద నివాళులర్పించారు.

గంగారం: అమరవీరుల ఆశయ సాధన కోసం పాటుపడదామని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ గంగారం– కొత్తగూడ సంయుక్త మండల కార్యదర్శి పూనెం ప్రభాకర్ అన్నారు. అమరవీరుల సభలు ఘనంగా నిర్వహించాలని ర్యాలీ నిర్వహించారు.

గార్ల: అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాటాలు కొనసాగించాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి సక్రు పిలుపునిచ్చారు. శుక్రవారం అమరవీరుల స్థూపాల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, సీహెచ్ గణేష్, సక్రు, మాన్యా, ఉపేందర్ పాల్గొన్నారు.

బయ్యారం: అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బయ్యారం, వెంకట్రాంపురంలో అమరవీరుల స్మారకస్థూపాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గౌని ఐలయ్య, బండారి ఐలయ్య, వెంకటేశ్వర్లు, పద్మ పాల్గొన్నారు.

నెల్లికుదురు: అమర వీరుల ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటుపడదామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 9వరకు జరిగే సభలను పురస్కరించుకుని శుక్రవారం జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వీరన్న, పాపారావు, వెంకన్న, మోష, యాకయ్య, సంపత్ పాల్గొన్నారు.

రైల్వే రక్షక దళం తనిఖీలు

మహబూబాబాద్ రూరల్: ప్రయాణికుల భద్రత నిమిత్తం మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో రైల్వే రక్షక దళం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్పీఎఫ్ ఎస్సై సుభాని గురువారం తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సుభాని మాట్లాడుతూ.. రైళ్లలో పేలుడు పదార్థాలు, నిషేధిత వస్తువులు తీసుకువెళ్లరాదని సూచించారు. అనధికారికంగా తినుబండారాలు అమ్మకూడదని, ప్రయాణికులతో ఇబ్బందికరంగా ప్రవర్తించరాదన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా పలు ప్రత్యేక నిర్మాణాలు జరుగుతున్నందున ప్రజలు సహకరించాలని కోరారు. రైల్వే స్టేషన్ పరిధిలో నిత్యం ఆర్పీఎఫ్ సోదాలు నిర్వహిస్తుందని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ రూరల్: దివ్యాంగుల సంక్షేమ సంఘం మరిపెడ మండల అధ్యక్షుడిగా తానంచర్ల రెవెన్యూలోని అజ్మీరతండా గ్రామ పంచాయతీ పరిధి ఢక్నాతండాకు చెందిన బానోతు శివ ఎన్నికయ్యాడు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా సంఘం నాయకులు కత్తుల మల్సూర్ ఆధ్వర్యంలో నూతన దివ్యాంగుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బోడ ధర్మ, కార్యదర్శిగా నగేష్, ట్రెజరర్‌గా భూక్య వీరన్న, కోశాధికారిగా ఆంగోతు రవికుమార్ ఎన్నికైనట్లు తెలిపారు.

ఎరువుల గోదాం తనిఖీ

కేసముద్రం: కేసముద్రం పీఏసీఎస్‌కి చెందిన ఎరువుల గోదాంను ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు సొసైటీలో పలు రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు

నెల్లికుదురు: మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌పై విలేకరుల సమావేశంలో దురుసుగా ప్రవర్తించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హెచ్. వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్‌లకు టీపీసీసీ క్రమశిక్షణ చర్య కమిటీ నుంచి నోటీసులు జారీ చేసింది.

ఆర్డీఓను కలిసిన తహసీల్దార్

నెల్లికుదురు: ఇటీవలే తొర్రూరు ఆర్డీఓగా విధులు చేపట్టిన గణేష్‌ను నెల్లికుదురు తహసీల్దార్ కోడి చింతల రాజు శుక్రవారం తొర్రూరు ఆర్‌డీఓ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కస్తూర్బాలో వైద్యశిబిరం

నర్సింహులపేట: మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి బాలికలకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ స్వప్న, ఏఎన్‌ఎంలు ప్రసన్నకుమారి, ఈరగాని సునీత, అన్వేష్‌కుమార్, ఆశవర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

కత్తితో దాడి

దోర్నకల్: మండలంలోని దుబ్బతండాలో పాతకక్షల నేపథ్యంలో శుక్రవారం ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేశారు. దోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బతండాకు చెందిన నూనావత్ వినోద్‌పై అదే తండాకు చెందిన బాదావత్ సురేష్ పాతకక్షల నేపథ్యంలో కత్తితో దాడి చేయగా ముఖంపై గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. వినోద్ భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఈనెల 12వ తేదీన జరిగే సీపీఎం పట్టణ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ పిలుపునిచ్చారు. పార్టీ ఎల్‌బీజీ నగర్ శాఖ మహాసభ శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మయ్య, లింగన్న, వెంకన్న, నగేష్, బిచ్యా, హరికిషన్, కిరణ్, తదితరుల పాల్గొన్నారు.

పోలీసుల చేతికి చిక్కి.. ఉడాయించిన మహిళ..!

బయ్యారం: మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏగా పనిచేస్తూ పలువురి నుంచి అప్పులు తీసుకొని ఉడాయించిన మహిళ శుక్రవారం బయ్యారం పోలీసుల చేతికి చిక్కినట్టు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రామసహాయం జానకి పలువురి నుంచి అధికమొత్తంలో వడ్డీ ఆశ చూపి కోట్ల రూపాయల్లో అప్పులు తీసుకుంది. అప్పులు తీర్చకుండా సంవత్సరం క్రితం ఉడాయించగా ఆమె అచూకీ లభ్యం కాలేదు. ఈక్రమంలో బయ్యారంలోని ఓ బ్యాంకుకు వచ్చి వెళ్తున్న జానకీని చూసిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తుంది. ఇల్లెందు వైపు వెళ్తున్న జానకీని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారం జరుగుతుండగా పోలీస్ అధికారులు మాత్రం తాము ఎవరిని అదుపులోకి తీసుకోలేదని పేర్కొంటున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కురవి: మండల కేంద్రానికి చెందిన కానుగంటి రాజు(48) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, కాంగ్రెస్ నాయకుడు నూకల అభినవ్ రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజు మృతదేహంపై వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, సోమిశెట్టి శ్రీనివాస్, మేక దామోదర్‌రెడ్డి, నూతక్కి నర్సింహరావు, వద్దుల సురేందర్‌రెడ్డి, బెడద వీరన్న, బాదె నాగయ్య, దైద భద్రయ్య, కిన్నెర మల్లయ్య, బండారి రమేష్, ఇరుగు వెంకన్న పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: దీపావళి పండుగ సందర్భంగా శ్రీవాసవీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, స్వీట్లు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గర్రెపల్లి వెంకటేశ్వర్లు, సోమ శ్రీనివాసు, బోడ్ల కామేశ్వరరావు, జంగాల వెంకట్, కర్లపాటి కృష్ణారావు పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఏక్తా దివస్



మహబూబాబాద్ రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది



నెహ్రూసెంటర్: పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సేవా సమితి సభ్యులు



దంతాలపల్లి: పోలీసులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై రాజు

మాజీ ఉప ప్రధాని, కేంద్ర హోంశాఖ మాజీ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించి, రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. - సాక్షి నెట్‌వర్క్

నాణ్యమైన విద్య అందించాలి



తొర్రూరు రూరల్: క్రమశిక్షణ, పట్టుదలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అరిపిరాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు తమ విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మంచి బోధన చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు స్కూల్‌కు వస్తూ కష్టపడి చదువుకోని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.